www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 19 | 06-02-2023 | పుటలు : 4

## నన్నయలో ఘనంగా ప్రారంభమైన మూడు రోజుల జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**31.01.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో "ప్రాచీన తెలుగు సాహిత్యం : చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలు" అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు.యూనివర్సిటీ సెమినార్ హాల్ లో మంగళవారం జాతీయ సదస్సు సాహిత్య ప్రముఖులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూరు మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు, భారతీయ భాషా సంస్థ మైసూరు డైరెక్టర్ ఆచార్య శైలేంద్ర మోహన్, డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య సి.వి.శివరామకృష్ణ, ఆచార్య ఆర్.వి.ఎస్.సుందరం, ఆచార్య శలాక రఘునాథశర్మ, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు అమెరికా తోటకూర ప్రసాద్ లు హాజరయ్యారు. సభాధ్యక్షులుగా ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, సంచాకులుగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కన్వీనర్ గా డా.తరపట్ల సత్యనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ తెలుగు భాష అంటే తనకెంతో ఇష్టమని ఎక్కువగా తెలుగులో మాట్లాడటానికే ఇష్టపడతానని అన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని చెప్పుకొనే మనము మన పిల్లలకు తెలుగు భాష, సాహిత్య మాధుర్యాలను తెలియజేయాలన్నారు. పురణాలలోని సంస్కృతిని, మంచితనాన్ని పిలలకు చెప్పాలన్నారు. ప్రతీ అధ్యాపకులు తమ పాఠ్యాంశాలతో పాటు భాష, సంస్కృతి, సమాజహితంగా జీవించడం వంటి విషయాలను విద్యార్థులకు తెలియజెప్పాలన్నారు. విద్యార్థులల్లో మానసిక దృక్పదాన్ని పెంపొందించాలన్నారు. మన ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన మల్లాడి సత్యనాయకర్ వంటి వారిని ఆదర్శంగా తీసుకొని సేవా దృక్పదాలను అలవర్చుకోవాలన్నారు. భాషపై పట్టు ఉంటేనే భావ బాగా అర్ధమవుతుందన్నారు. మూడు రోజుల సదస్సును నిర్వహిస్తున్న నిర్వహకులను అభినందించారు. భారతీయ భాషా సంస్థ మైసూరు డైరెక్టర్ ఆచార్య శైలేంద్ర మోహన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజేసారు. ఎంతో ప్రాచీన సంస్కృతి కలిగిన భారతదేశంలో తెలుగు భాషా, సాహిత్యాలకు విశిష్ట ప్రాధన్యత ఉందని చెప్పారు. భారతీయ భాషా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గ్రంథాలను అనువదిస్తామని తెలిపారు. తెలుగు డిక్షనరీ, చారిత్రక గ్రంథాలను, సెమినార్లను నిర్వహిస్తు సమాజ హితమైన సాహిత్య భాషాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య సి.వి.శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రాచీన తెలుగు సాహిత్యం : చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలకు సంబంధించిన అనేక విషయాలను చర్చించారు. ఆయా భాషల్లో ఉన్న నిఘంటువులలోని విశేషాలను తెలియజేసారు. ఆచార్య ఆర్.వి.ఎస్.సుందరం మాట్లాడుతూ మూడు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అద్భుతమైన భాష తెలుగు భాష అని కొనియాడారు. గాథాసప్తశతి కాలం నుండే తెలుగులో జానపద గేయాలు ఉన్నాయని తెలిపారు. దేశభాషలందు తెలుగులెస్స అని చెప్పిన శ్రీకృష్ణ దేవరాయులు నుండి అనేక మంది పరభాషా ప్రముఖులు తెలుగు ఔన్నత్యాన్ని ప్రశంసించారని అన్నారు. ఆచార్య శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ పద్యంలోని నాలుగు పదాలను కలిపే గొప్ప సాహిత్యం తెలుగు భాషలో ఉందని చెప్పారు. అటువంటి పద్యాలను ధారణ చేయడం ద్వారా ప్రాణాయామం సిద్ధిస్తుందని తెలిపారు. స్వచ్ఛమైన తెలుగు భాష చదివు సంధ్యలు లేని గ్రామీణ ప్రజల మధ్య ఉందని చెప్పారు. తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ ప్రాచీన తెలుగు భాష సాహిత్యం : చారిత్రక, సామాజిక, సాంస్కృతికి కృషి చేసిన మహనీయుల వివరాలను తెలియజేసారు. అనంతరం నిర్వహకులు అతిథులను సన్మానించి జ్ఞాపికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, సంచాకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ, డా.పి.వి.బి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాచీన తెలుగు సాహిత్య జాతీయ సదస్సు విజయవంతం

**04.02.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో "ప్రాచీన తెలుగు సాహిత్యం : చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలు" అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. శనివారం జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి హాజరై సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. తెలుగు భాషకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని ఈ మూడు రోజుల సదస్సులో భాషలోని వివిధ కోణాలను, సాహిత్య, చారిత్రక, సామాజిక నేపధ్యాలను వక్తలు, పరిశోధకులు వివరించారని తెలిపారు. తెలుగు భాష ఔనత్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు ఎంతో దోహదపడతాయని అన్నారు. భవిష్యత్ లో ఇటివంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని తెలుగు వెలుగు ప్రపంచానికి తెలియజేయాలని తెలిపారు. ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ మూడు రోజుల జాతీయ సదస్సులో చక్కని పరిశోధన పత్రలను సమర్పించిన పరిశోధకులకు, చక్కగా నిర్వహించిన నిర్వహకులకు అభినందనలు తెలియజేసారు. జాతీయ సదస్సు సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ లు ప్రాచీన తెలుగు సాహిత్యం : చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలకు సంబంధించి మూడు రోజుల సదస్సులో సమర్పించి ప్రధాన సమర్పణ పత్రాలను గురించి ప్రస్తావించారు. మూడు రోజుల జాతీయ సదస్సులో 90 పరిశోధన పత్రాలను సమర్పించారని తెలియజేసారు. భారతీయ భాష డిప్యూటి డైరెక్టర్ ఆచార్య సి.వి.శివరామకృష్ణ సదస్సు విజయవంతంగా జరిగిందని చెప్పారు. మూడు రోజుల సదస్సుకు ఆతిథ్యమిచ్చిన యూనివర్సిటీ వీసీ జి.వి.ఆర్.ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మరియు అధికారులకు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. తరువాత సదస్సు కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ రచించిన యజ్ఞ అనే వాస్తవిక వచన కవిత్వం కన్నడంలో డా.ఎ.మునిరాజా అనువదించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం అతిథులను సన్మానించి సర్టిఫికెట్టులను అందజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ కో ఆర్డినేటర్ డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్,ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, డా.పి.వి.బి.సంజీవరావు, నూజిళ్ళ శ్రీనివాసరావు, డా.ఎస్.సుధారాణి, డా.జె.మాధ్యాన తెలంగాణ, డా.నూనె అంకమరావు నెల్లూరు పాల్గొన్నారు.



జాతీయ సదస్సులో యజ్ఞ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

## గూడెం క్యాంపస్‌లో నూతన భవనాల ప్రారంభోత్సవం

**మంత్రి బొత్స సత్యనారాయణ హాజరు - విసి ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు**



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ లో నూతనంగా నిర్మించిన కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మరియు ఉమెన్స్ హాస్టల్ భవనాలను ఈనెల 7వ తేదీన ప్రారంభిస్తున్నామని వీసీ ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, దాడిశెట్టి రామలింగేశ్వర రావు, తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, హయర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ జె.శ్యామలరావు ఐఏఎస్, యాప్షీ చైర్మన్ ఆచార్య కె. హేమచంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఐఏఎస్ మరియు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అధికారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమ ఏర్పాట్లను రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీరమేష్ పరిశీలిస్తున్నారని తెలియజేశారు.

## సంపాదకీయం



# కవిత్వ ప్రయోజనం!

కవి స్వయంభువే! సృష్టికర్త ఈ లోకాన్ని ఎలా తయారు చేస్తున్నాడో అలాగే కవి కూడా కావ్య సృష్టి చేస్తాడు. కవి సామాన్యుడు కాదు, ప్రతిభావంతుడు. ఒక సంఘటనను లేదా విషయాన్ని అందరూ చూస్తారు. కవి కూడా చూస్తాడు. ఆ సంఘటనలోని విశేషాన్ని గుర్తించి స్పందించి తాను అనుభవించిన విచిత్రానుభూతిని లోకానికి అందించే శక్తి ఒక్క ద్రష్ట అయిన కవికి మాత్రమే ఉంటుంది. వాల్మీకి హృదయం స్పందించి కరుణతో కరిగిపోయి శోకం శ్లోకమయింది. అది అతనిని ఆదికవిగా చేసింది. కవి వాక్కు తిరుగులేనిది. నిరంకుశమైంది. అతని చేతిలో ఏ వస్తువైనా సర్వాంగ సుందరంగా మారుతుంది.

అపారమైన కావ్యప్రపంచంలో కవే బ్రహ్మ. కవి తనకు తోచినట్లు విశ్వాన్ని మార్చగలడు.సుప్తమైన మానవ చేతస్సును శాశ్వత ధర్మ గీతికలలో జాగృతం చేయటానికి కేవలం కవితా ప్రతిభే కాదు. అసాధారణమైన వ్యక్తిత్వం,అప్రతిహతమైన శక్తి కూడా కవికి ఉంటుంది. ఋషి వంటి విశాల విశ్వ దర్శనం, సునిశితమైన మేధాశక్తి ఆనందామృతాన్ని అందరికీ పంచి పెట్టాలన్న తపనతో ప్రేమపూర్వక హృదయంతో కవి కావ్య నిర్మాణం చేసి లోకానికందిస్తాడు.అందుకే కవితా ప్రపంచం వేరు. సామాన్యులు చూడలేని వింతలెన్నో, రహస్యాలెన్నో కవి కంటికి కనిపిస్తాయి.

ఆ కవితా ప్రపంచాన్ని చూడాలంటే సత్కవీశుని భావలోచనంతో చూడాలన్నారు కవికోకిల దువ్వూరి. కవిత్వం ఒక మెస్మరిజమ్ కవి కన్ను ఒక ప్రిజమ్ అన్నారు శేషేంద్రశర్మ. ఆ పట్టకంలో నుంచి చూస్తేనే ప్రపంచంలో అంతర్లీనంగా ఉన్న కనికట్టు కనిపిస్తుంది. కవి సంకల్పిత కావ్య ప్రపంచమంతా సుఖమయమై, శుభావహమై లోక శ్రేయస్సును కలిగిస్తుంది. కవి సృష్టించిన కావ్య ప్రపంచం మానవ జీవితానికి ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ పురుషార్థాలను సమకూరుస్తుంది.

అందుకే కవి ఎప్పుడూ ఉదార మానవతావాద వైఖరిని వదలడు. అతని అంతరంగం ఆకాశమంత విశాలం. కవిది సత్య దర్శనం. ఆవిష్కారం వెన్నెలలా విశదం. సామాజిక అవగాహన, రాజకీయ పరిశీలనతో మానవ స్వభావంలోని చిక్కుముడులను తీక్షణంగా, లోతుగా పరిశీలించే తాత్త్విక లక్షణం కలిగి ఉంటుంది. సామాజిక న్యాయానికి, భద్రతకు ప్రాతినిధ్యం వహించే ప్రతిపక్షంలో కవి ఉంటాడు. ఏ కాలంలోనైనా సమాజం పొందే అనుతాపం యొక్క గాథలే కవితా రూపంలో అవతరిస్తూ ఉంటాయి.

కవిత్వం ప్రచార సాధనం కాదు. ఒక కరపత్రం. దాని మార్గం, ఉద్దేశం, ప్రయోజనం వేరు. సమాజాన్ని ఒక త్రాటి మీద నడిపించడమే దాని మార్గం. జీవితాన్ని వ్యాఖ్యానించటమే దాని ఉద్దేశం.మానవ సౌభ్రాత్రమే దాని ప్రయోజనం.

నెల్లూరు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, మైసూరు భారతీయ భాషా సంస్థానం మూడు రోజులపాటు ఒక సదస్సు రూపంలో తెలుగు ప్రాచీన కవిత్వాన్ని విశ్లేషణ చేయడానికి నన్నయ విశ్వవిద్యాలయాన్ని వేదిక చేసుకోవటం ఎంతో ముదావహం. శుభమస్తు!

డా.తలారి వాసు

# రెండోరోజు ప్రాచీన తెలుగు సాహిత్యంపై సమగ్ర అధ్యయనం

**03.02.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో "ప్రాచీన తెలుగు సాహిత్యం : చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలు" అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. జాతీయ సదస్సు సంచాలకులుగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కన్వీనర్ గా డా.తరపట్ల సత్యనారాయణ వ్యవహరించారు. యూనివర్సిటీలోని నన్నయ, తిక్కన, ఎఱ్ఱన పేర్లతో ఏర్పాటు చేసిన సభావేదికలపై తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ డా.కరిమిండ్ల లావణ్య, ఆంధ్రవిశ్వవిద్యాలయం గౌరవ ఆచార్యులు వెలమల సిమ్మన్న, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరిశంకర్, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఒంగోలు తేళ్ల అరుణ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ ఆచార్య డి.విజయలక్ష్మి, ప్రముఖ రచయిత్రి డా.చిల్లర భవానీదేవి, లయోలా కళాశాల డా.గుమ్మా సాంబశివరావు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి డా.జె.బి.చక్రవర్తి లు అధ్యక్షత వహించి పరిశోధ పత్ర సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. వీటిలో ప్రధానంగా పశ్చిమ గోదావరి జిల్లా సంస్థానముల చరిత్ర, సాహిత్య సేవ-పరిశీలన అనే అంశంపై డా.షేక్ బాబూజి, శ్రీనాథ కవి రచనలు - సామాజిక దృక్పథం అనే అంశంపై కానాల రామచంద్రారెడ్డి, తెలుగు నాట వాగ్గేయ కారుల సాహిత్యం - సామాజిక స్పృహ అనే అంశంపై డా.పెద్దింటి ముకుందరావు, మనుచరిత్ర శాస్త్ర-సామాజికాంశాలు అనే అంశంపై డా.జాడా సీతాపతిరావు, తూర్పుగోదావరి జిల్లా గ్రామ దేవతలు చారిత్రక, సాంస్కృతిక, విశ్లేషణ అనే అంశంపై సిద్దిళ్ళ రాజు, ప్రాచీన తెలుగు సాహిత్యం కులసంస్కృతుల అభివర్ణనలు అనే అంశంపై డా.మల్లె భాగ్యలక్ష్మి, రంగనాథ రామాయణం అవాల్మీకాంశాలు : సామాజిక నేపథ్యం అనే అంశంపై అదిఆంధ్ర రామాంజనేయులు, నీతి శతకము - సామాజికాంశాలు డా.టి.షర్మిలా ప్రతిమ, మహాభారతం - ద్రౌపతి వివాహం - సామాజిక దృక్పథం అనే అంశంపై డా.ఎం.వెంకటగౌరి లు పత్రలను సమర్పించారు. ఈ కార్యక్రమాలలో అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విశ్వ విద్యాలయ ప్రిన్సిపాల్ డా.లావణ్య




## జియాలజీ ఫీల్డ్ వర్క్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ జియాలజీ మరియు జియోఫిజిక్స్ విద్యార్థుల పరిశీలన కోసం కెవిఆర్ కంపెనీ గౌరీపట్నం క్వారీని సందర్శించారు. ఈ సందర్శనలో విభాగ ఆచార్యులు వై.శ్రీనివాసరావు, జి.ఎస్.ఐ. రిటైర్డ్ డైరెక్టర్స్ డా.జి.అప్పారావు, ఎం.సత్యనారాయణ మరియు విద్యార్థులు హాజరయ్యారు. అగ్నిపర్వత బసాల్ట్ శిలలు, లావా ప్రవాహాలు మరియు వివరణాత్మక పెట్రోలాజికల్, కంపోజిషనల్, శిలాజాలను పరిశీలించారు. అరుదైన శిలాజాలు మరియు రాక్స్పెసిమెన్ ల సంఖ్యను సేకరించారు. అలాగే జీలకర్రగూడెం సమీపంలోని గుంటుపల్లి గుహల ప్రదేశాన్ని సందర్శించారు. బౌద్ధారామ పురావస్తు ప్రదేశంలో విద్యార్థులకు అవక్షేప నిర్మాణాలు మరియు నిక్షేపణ పరిసరాలను పరిశీలించి శిక్షణను అందించారు. క్రాస్ బెడ్డింగ్ నిర్మాణాలతో నీటి ప్రవహ దిశలను సూచించారు.



# ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని క్లబ్ ఆంగ్లోసఫీ, సైన్స్ మరియు హ్యుమానిటీస్ విభాగం, గో అబ్రాడ్ కన్సల్టెన్సీ హైదరాబాద్‌తో కలిసి విదేశీ విద్యా అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ కోఆర్డినేటర్ బిబి అహ్మద్ అలీబాబా మాట్లాడుతూ క్లబ్ ద్వారా విద్యార్థులకు ఎల్ఎస్ఆర్డబ్ల్యు నైపుణ్యాలను మెరుగుపరచడానికి అకడమిక్ గైడెన్స్‌తో పాటు ఐఇఎల్‌టిఎస్ శిక్షణ కూడా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్లబ్‌ల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం కోర్సు కో ఆర్డినేటర్ డా. జి. కీర్తిమారిటా పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ అమెరికా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో విదేశీ విద్యను అభ్యసించేందుకు వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.



రిసోర్స్ పర్సన్ వినోద్ కుమార్ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే దశలను విద్యార్థులకు తెలియజేశారు. విదేశాల్లో విద్యనభ్యసించడం వల్ల కలిగే అనేక ప్రయోజనాలను తెలియజేశారు.

## ప్రతిభావాణి

# కళాతపస్వి కె. విశ్వనాథ్

**(19.2.1930 - 2.2.2023)**



బాపట్ల జిల్లా రేపల్లెలో జన్మించారు. తల్లిదండ్రులు కాశీనాధుని సుబ్రహ్మణ్యం, శ్రీమతి సరస్వతి. గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్, ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశారు. తండ్రి చెన్నైలో విజయ వాహిని స్టూడియోలో పనిచేసేవారు. విశ్వనాథ్ డిగ్రీ పూర్తవుగానే అదే స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్ గా సినీ జీవితాన్ని ప్రారంభించారు. పాతాళభైరవి సినిమాకు అసిస్టెంట్ రికార్డిస్ట్ గా చేశారు. ఆదుర్తి సుబ్బారావు గారి దగ్గర అసోసియేట్ గా చేశారు. 1965లో ఆత్మగౌరవం సినిమా దర్శకునిగా అవకాశం వచ్చింది. తొలిచిత్రానికే నంది అవార్డు సాధించారు. సాగర సంగమం, స్వాతిముత్యం, సిరిసిరిమువ్వ, శృతిలయలు, సిరివెన్నెల, ఆపద్బాంధవుడు, స్వయంకృషి వంటి సినిమాలు అందించారు. 1992లో పద్మశ్రీ, 2017 లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డును అందుకున్నారు. నంది,ఫిల్మ్ ఫేర్ అవార్డులతో పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1980 ఫిబ్రవరి 2న శంకరాభరణం సినిమా విడుదలైంది. అదే తేదీలో ఆయన మరణించడం యాదృచ్ఛికం.

కె విశ్వనాథ్ తెలుగు సినీ జగత్తులో దర్శక ఋషి. సమాజంలో పేరుకుపోయిన సమస్యల్ని ఆయన చిత్రాలు కట్టెదుట పిలిపి నిలదీసి పరిష్కారాలను సూచించాయి. ఆచార వ్యవహారాల కన్నా మానవత్వం గొప్పదని "శంకరాభరణం" సినిమా సమాజానికి సందేశాన్ని ఇచ్చింది. మనుషులను విడదీసే కుల వ్యవస్థను చెరిపివేయాలని "సప్తపది" స్పష్టం చేసింది. చేసే పని తపస్సు అయితే అది మనల్ని ఉన్నత స్థాయికి తీసుకు వెళుతుందని "స్వయంకృషి" చెప్పింది. అవినీతి అక్రమాలను ఎదుర్కోవటానికి హింస మార్గం కాదని శాంతియుత మార్గమే ఉత్తమమని "సూత్రధారులు" బోధించింది. వరకట్నం సమస్యని సునిశిత హాస్యంతో మేళవించి "శుభలేఖ" చూపించింది. ఎంత ఉన్నతమైన వ్యక్తినైనా అసూయ ద్వేషాలు అధఃపాతాళానికి దిగజారుస్తాయని "స్వాతికిరణం" కళ్ళు తెరిపించింది. సమాజాన్ని సినిమా జాగృతం చేయగలదని మనసా వాచా కర్మణా విశ్వనాథ్ నమ్మి అరుదైన అద్భుతమైన చిత్రాలను వెండితెరపై కమనీయంగా మలిచారు.

ఆ అసమాన యశస్వికి నన్నయవాణి అక్షర నిరాజనాన్ని సమర్పిస్తుంది.

## మంచిమాట



**మ్నొదట మీరు పవిత్రులు కండి. ప్రపంచమంతా పవిత్రంగా కనబడి తీరుతుంది.**

Purify yourself first and the world is bound to be purified then.

**- స్వామి వివేకానంద.**

# సాఫ్ట్ బాల్ మహిళల టీమ్ సెలక్షన్స్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మహిళల సాఫ్ట్ బాల్ టీమ్ సెలక్షన్స్ ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ప్రారంభించారు. ఈ సెలక్షన్స్ కు వ్యాయామ విద్యా కళాశాలలు మరియు డిగ్రీ కళాశాల నుండి 55 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనపరచిన 16 మందిని యూనివర్సిటీ టీమ్ గా ఎంపిక చేసి ఛండీఘడ్ లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ పోటీలకు పంపిస్తారని చెప్పారు. క్రీడాకారులందరికీ శుభాకాంక్షలను తెలియజేసి సాఫ్ట్ బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, ఎం.పి.ఈడీ కోర్సు కోఆర్డినేటర్ డా.బాలసత్యనారాయణ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా.బి.రామగోపాల్, సెలక్షన్స్ కమిటీ మెంబర్స్ డా.మోజిసన్ బాబు, నారాయణ, దావూద్ ఖాన్, హబీబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ జాతీయ సేవా సమితి (ఎన్ఎస్ఎస్) మరియు ఆల్ ఇండియా ఉమెన్ కాన్ఫరెన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఎన్టీఆర్ బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాంలో క్యాంపస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమల కుమారి మరియు ఏఐడబ్ల్యుసి కోశాధికారి పద్మజ రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి మాట్లాడుతూ ఎంతో సుందర నగరం గా పేరుగాంచిన కాకినాడకు పర్యాటకులను విశేషంగా ఆకర్షించే ఎన్టీఆర్ బీచ్, ఉప్పాడ బీచ్ లాంటివి మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం చేయడం నిజంగా అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎల్ మధు కుమార్, వి శ్రీనివాసరావు, శ్రీరామరాజు, మనోజ్ దేవా తదితర బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను వివిధ వ్యర్థాలను తొలగించి వాటిని మున్సిపాలిటీ వారు సూచించిన ప్రదేశాల్లో నిర్జీవం చేశారు.



## విక్టరీ క్లబ్ ఆధ్వర్యంలో

# యుక్తి

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసిఈ విభాగం విక్టరీ క్లబ్ ఆధ్వర్యంలో యుక్తి పేరుతో యాటిట్యూడ్ అండ్ రీజనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 51 మంది విద్యార్థులు 18 గ్రూప్ లుగా పాల్గొన్నారు. క్లబ్ కోఆర్డినేటర్ అలికాని విజయదుర్గ విజేతల వివరాలను తెలియజేసారు. మొత్తం 90 మార్కుల పరీక్షలో 63 మార్కులు సాధించిన డి.తేజ్వీర్, సిహెచ్.రాజేష్, సిహెచ్. కేతన్ కుమార్ గ్రూప్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాగే 59 మార్కులతో డివి.రత్నకుమార్, జి.ఎన్.వి.కె.చైతన్య, వై.ప్రసన్న కుమార్ రెండవ స్థానంలో నిలిచారని చెప్పారు. విజేతలను ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ అభినందించారు.

## భూమి కోసం...!!



మనం నివసిస్తున్న ఈ భూమికోసం, చుట్టూ ఉన్న
సమాజం కోసం ఒక్క నిమిషం కేటాయిద్దాం.
మంచు పర్వతాలు కరిగిపోతున్నాయి
అడవుల నాశనమైపోతున్నాయి ప్రకృతి
వైపరీత్యాలు సంభవిస్తున్నాయి.
చెట్లు నరకడం వలన, అతిగా ప్లాస్టిక్
వినియోగించడం వలన భూమిపై వన్యప్రాణుల
ఉనికిని మనం ప్రశ్నార్థకం చేస్తున్నాం!
భూతాపం పెరిగిపోతుంది
నేలలో సారం తగ్గిపోతుంది.
రోజురోజుకీ తుఫానులు, భూకంపాల తీవ్రత
అధికమవుతున్నాయి.
ఈ ఆపదల నుండి మనల్ని మనం
కాపాడుకుందాం..
రండి ఈ భూమి కోసం మనం ఒక్క నిమిషం
కేటాయించండి.
మొక్కలు నాటి పెంచుదాం
ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకుందాం.
ప్రకృతి వనరులను కాపాడుకుంటూ భవిష్యత్
తరాలకి మంచి గాలిని, స్వచ్ఛమైన నీటిని
అందిద్దాం!!

**- బి. సుశాంత్ కుమార్**

# కాకినాడ క్యాంపస్‌లో మల్లాడి సత్యలింగం నాయకర్ వర్థంతి



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు మహనీయులు శ్రీమల్లాడి సత్యలింగం నాయకర్ 108వ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాదరాజు, అధ్యక్షులు క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమలకుమారి, ఎం.ఎస్. ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, స్వర్గీయ మల్లాడి శివరాం నాయకర్ సతీమణి శ్రీమతి చంద్ర కుమారి, ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతిశ్రీ అతిథులుగా హాజరై మహాదాత శ్రీ మల్లాడి సత్యలింగం నాయకర్ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. తరువాత విద్యార్థులను ఉద్దేశించి వీసీ మాట్లాడుతూ " ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా కాకినాడ నగరంలో ఎంఎస్ఎన్ చారిటీస్ గూర్చి వారు చేసే సేవ కార్యక్రమాలు గూర్చి చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు ఎవరిని అడిగినా చెబుతారని అంతటి ప్రాముఖ్యమైన ఎం.ఎస్. ఎన్ క్యాంపస్ లొ విద్యార్థులు చదవడం నిజంగా పూర్వజన్మ సుకృతమని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి ఎన్నో విద్యాపరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భావితరాల అభివృద్ధి విద్యతోనే సాధ్యమని అనేక పథకాలను ప్రవేశపెట్టి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. నిరక్షరాస్యులు అయిన మహాదాత శ్రీ మల్లాడి సత్యలింగం నాయకర్ భావితరాల కోసం అత్యంత సంపన్నమైన తన ఆస్తిపాస్తులను అన్నిటిని విద్యార్థుల అభివృద్ధి పనులకు దానం చేయడం విద్య పట్ల వారికి గల నిబద్ధతని తెలియజేస్తుందని చెప్పారు. అలాగే ప్రస్తుతం చైర్మన్ గా వ్యవహరిస్తున్న మల్లాడి కార్తీక్ నాయకర్ తన తండ్రి అడుగుజాడల్లో ఈ స్ఫూర్తిని కాపాడుతూ చిన్న వయసులోనే పరిణితి చెందిన ఆలోచనతో ఎంఎస్ఎన్ చారిటీస్ ని కాపాడడం హర్షదాయకమని సూచించారు. ఈ సందర్భంగా స్మృతి సభను ఏర్పాటు చేసిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారిని ప్రశంసించి రాబోవు తరాలలో క్యాంపస్ అభివృద్ధికి తన వంతు కృషిని అందిస్తానని తెలియజేశారు. విద్యార్థులతో ముచ్చటించి ఆత్మస్థైర్యాన్ని మంచి అలవాట్లను ఏ విధంగా పెంపొందించుకోవాలనే అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా వీసీ ప్రసాదరాజును ప్రిన్సిపల్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# లైఫ్ సైన్సెస్ ఫ్రెషర్స్ పార్టీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీనిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ పార్టీలో బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఆక్వాకల్చర్, జువాలజీ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు.



